యథేచ్ఛగా బోర్లు.. అనుమతిచ్చిందెవరో?

కంటోన్మెంట్‌లో ఇష్టానుసారంగా బోర్ల తవ్వకాలు

తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో వెలుగులోకి..

కలెక్టర్‌కు బోర్డు అధికారుల ఫిర్యాదు


మంచినీటి పైపులైను పగిలి రోడ్డుపైకి ఉబికి వస్తున్న తాగునీరు

కంటోన్మెంట్: దున్నపోతు ఈనిందంటే.. దూడను దొడ్లో కట్టేయమన్నట్లు తలపిస్తోంది కంటోన్మెంట్ బోర్‌వెల్స్ వ్యవహారం. మూడేళ్ల క్రితం నాటి ఎమ్మెల్యే నిధులతో మంజూరైన బోర్‌వెల్స్ అంటూ నాలుగైదు రోజులుగా కంటోన్మెంట్‌లో పెద్ద సంఖ్యలో బోర్‌వెల్స్ వేస్తున్నారు. మొదట్లో ఈ నిధులు మా తండ్రి హయాంలో మంజూరైనవి అంటూ దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదిత బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ప్రస్తుతం తాను ఎమ్మెల్యేగా ఉండగా, ఓడిపోయిన వారి చేత శంకుస్థాపనలు ఏంటని ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రశ్నించారు. దీంతో సదరు బోర్‌వెల్స్ నిర్వాహకుడు ఎమ్మెల్యే శ్రీగణేశ్ చేత కొబ్బరికాయలు కొట్టిస్తూ బోర్‌వెల్స్ వేయడం మొదలు పెట్టాడు. ప్రొటోకాల్ ప్రకారం తనను పిలుస్తున్నారని భావించిన ఎమ్మెల్యే సైతం ఆ బోర్‌వెల్స్‌కు సంబంధించిన అనుమతులను పరిశీలించకుండానే ప్రారంభోత్సవాలు చేస్తూ పోయారు. ప్రజల దాహార్తి తీర్చే కార్యక్రమం కదా అంటూ కాంట్రాక్టర్ చెప్పినట్లుగా ఎమ్మెల్యే అనుసరిస్తూ వచ్చారు. అయితే ఈ బోర్‌వెల్స్‌కు కంటోన్మెంట్ నుంచి ఎలాంటి అనుమతులు లేవనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరా తీసిన బోర్డు ఉన్నతాధికారులకు విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. దీంతో అనుమానం వచ్చిన బోర్డు ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం. కంటోన్మెంట్‌లో అనుమతులు లేకుండానే సాగుతున్న బోర్‌వెల్స్ వ్యవహారంపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరడం విశేషం.

పైపులైన్ పగలడంతో..

కంటోన్మెంట్ నాలుగో వార్డు పికెట్ లక్ష్మీ నగర్‌లో బుధవారం ఓ మంచినీటి బోరు వేశారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కొబ్బరికాయ కొట్టించి మరీ వేసిన ఈ బోరుకు కంటోన్మెంట్ బోర్డు అధికారుల నుంచి అనుమతి లేదు. ఎలాంటి అధికారిక పర్యవేక్షణ లేకుండానే బోరు వేశారు. అయితే బస్తీకి తాగునీటిని సరఫరా చేసే పైపులైను మీద బోరు వేయడంతో, సదరు పైపులైను పగిలిపోయింది. మరుసటి రోజు బోర్డు సిబ్బంది ఆ పైపులైను ద్వారా నీటిని విడుదల చేయగా నేరుగా బోరుబావిలోకి పోతున్నాయి. బస్తీవాసులకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో కొందరు స్థానికులు బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎవరికీ సమాచారం లేకుండానే!

లక్ష్మీనగర్‌లో మంచినీటి పైపులైను పగిలిపోయిన విషయం తెలుసుకున్న బోర్డు తాగునీటి విభాగం ఉన్నతాధికారులు, బోర్‌వెల్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు జిల్లా కలెక్టరేట్‌లోని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌ను సంప్రదించారు. అయితే బోర్‌వెల్ ఎవరు వేశారో తమకు సమాచారం లేదంటూ సమాధానం ఇవ్వడం గమనార్హం. దీంతో అనుమానం వచ్చిన బోర్డు అధికారులు మరింత లోతుగా ఆరా తీయడంతో తెలంగాణ సొసైటీ ఫర్ ట్రెయినింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ (టీఎస్ఎస్‌టీఈపీ) ఆధ్వర్యంలో బోర్‌వెల్ వేసినట్లు తెలిసింది. అయితే సదరు సంస్థ బోర్‌వెల్ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చిందనే విషయం మాత్రం వెల్లడి కాలేదు.

మా అనుమతి లేదు..

నియోజకవర్గ అభివృద్ధి నిధులతో కొన్ని రోజులుగా కంటోన్మెంట్‌లో పలు బోర్లు వేసిన విషయం ఇటీవల మా దృష్టికి వచ్చింది. వీటికి బోర్డు తరఫున ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు, కనీసం మాకు సమాచారం కూడా లేదు. అనుమతి లేకుండా బోరు వేసి, కంటోన్మెంట్ తాగునీటి పైపులైను పగిలిపోయిన విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. రక్షణ స్థలాల్లోనూ అనుమతి లేకుండా బోర్లు వేయడంపై కఠిన చర్యలుంటాయి.

–మధుకర్ నాయక్, బోర్డు సీఈఓ


పద్మారావునగర్ పార్కులో ..


వారాసిగూడలోని ఏసీపీ కార్యాలయంలో యోగా చేస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

సర్వం..యోగామయం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్,సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో యోగా సాధకులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యోగా చేయడం ద్వారా మానసిక, శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. యోగాను దినచర్యలో భాగంగా చేర్చుకుంటే జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారన్నారు. – సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


యోగా చేస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్


పికెట్ గురుకుల పాఠశాలలో యోగాడేకు హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేశ్


క్లాసిక్ గార్డెన్‌లో ఆసనాలు వేస్తున్న దృశ్యం


యోగాసనాలను వేస్తున్న బండా కార్తీకరెడ్డి


విద్యార్థులతో కలిసి యోగసనాలు వేసిన లక్ష్మణ్


బౌద్ధనగర్‌లో యోగా చేస్తున్న స్థానికులు


పికెట్ గార్డెన్‌లో యోగా డే వేడుకల్లో పాల్గొన్న సీఈఓ, బోర్డు అధికారులు


యోగాసనాలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో అధికారులు, సిబ్బంది

సెయింట్ థెరిస్సా పూర్వ విద్యార్థుల ఉదారత



సనత్‌నగర్: సెయింట్ థెరిస్సా పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థి (1983 బ్యాచ్) చక్రపాణి ఈ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు చేయూతనందించారు. నలుగురు విద్యార్థులకు స్కూల్ ఫీజును చెల్లించారు. 12 మందికి డ్రెస్ మెటీరియల్, 6000 ఇన్సినేటర్ నాప్కిన్స్‌ను అందించారు. 1981 బ్యాచ్‌కు చెందిన మరో పూర్వ విద్యార్థిని, లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ ఎం.విజయలక్ష్మీ రూ.50 వేల విలువైన చాక్లెట్స్‌ను స్కూల్ యాజమాన్యానికి అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, అసోసియేషన్ కార్యదర్శి ధనశేఖర్ రెడ్డి, కోశాధికారి చెంగల్వ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కంజర్ల సదాశివయాదవ్, చక్రపాణి, రాధిక, విజయలక్ష్మీ, సంయుక్త కార్యదర్శులు లిజి, రఫత్ సుల్తానా, త్రిమూర్తులు, స్వప్నశ్రీ, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడులపై దృష్టి సారించాలి

లాలాపేట: ప్రభుత్వ నిర్లక్ష్యం వలన సర్కారు బడులు సమస్యలకు నిలయాలుగా మారాయని సికింద్రాబాద్ సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన సర్కారు బడులు పరిశీలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం సైతం నాసిరకంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి బాబు, నాగరాజు, సయ్యద్ గౌస్, హుస్సేన్, వెంకట్‌గౌడ్, రజనీకాంత్, అంబలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (వ్యాయామ విద్య) కాలేజీ పీజీ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. శుక్రవారం కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీఈడీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. వచ్చే నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సీనియర్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్ ప్రొ.సత్యనారాయణపై అభిమానంతో విద్యార్థులు ఫొటోలు దిగి సందడి చేశారు.

పీహెచ్‌డీ గడువు పొడిగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ 2018 బ్యాచ్ రీసెర్చ్ ప్రోగ్రెస్ సెమినార్ గడువును పొడిగించాలని పరిశోధన విద్యార్థులు శుక్రవారం ఓయూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కరోనా సెలవులతో పాటు ఎన్నికలతో రీసెర్చ్ వర్క్ నిలిచిపోయిందని ఈనెల 25న జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో గడువు పొడించాలని కోరారు.

పీహెచ్‌డీకి గడువులుండవు..

యూజీసీ నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ డాక్టరేట్ కోర్సును పూర్తి చేసేందుకు ఎలాంటి గడువులు ఉండవని ఓయూ సీనియర్ ప్రొఫెసర్లు పేర్కొన్నారు. పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన తర్వాత ఎన్ని ఏళ్లకైనా పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ డిగ్రీ పట్టాను పొందవచ్చని సూచించారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇంత వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.7,200 కోట్లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్లను తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదివిన చదువు సర్టిఫికెట్ల రూపంలో కాలేజీల్లో ఉండటంతో వివిధ కోర్సులు పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉద్యోగాలు, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నీట్ అక్రమాలపై ఓయూలో కొనసాగుతున్న నిరసనలు

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ అక్రమాలు, యూజీసీ నెట్ ప్రశ్నపత్రం లీకేజీలపై ఓయూలో నిరసనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేసి సీబీఐ చే విచారణ జరిపించాలని ఏబీవీపీ నాయకులు జీవన్ పృథ్వీ తేజ పేర్కొన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ డిమాండ్ చేశారు. నీట్‌ను రద్దు చేయాలని, యూజీసీ నెట్ అక్రమార్కులను విధుల నుంచి తొలగించాలని, ఎన్‌టీఏ ను ప్రక్షాళన చేయాలని వామపక్ష, టీజేఎస్ విద్యార్థి నేతలు కేంద్రాన్ని కోరారు.

యూపీఎస్సీ ర్యాంకర్ల దాతృత్వం

ఉస్మానియా యూనివర్సిటీ: యూపీఎస్సీ–2024 ర్యాంకులు సాధించిన అభ్యర్థులు నేడు (22న) నిరుపేద ఆడపిల్లలకు సుకన్య ఖాతాలు తెరిపించనున్నారు. స్ఫూర్తి పేరుతో నేడు (22న) ఉదయం 11 గంటలకు ఓయూ క్యాంపస్‌లోని పోస్టాఫీసు (ఆర్ట్స్ కాలేజీ వెనుక) ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 40 మంది యూపీఎస్సీ ర్యాంకర్లు హాజరై సుకన్య సమృద్ధి ఖాతా పాసు పుస్తకాలను అందచేయనున్నట్లు తెలంగాణ సర్కిల్ పోస్టు మాస్టర్ జనరల్ టీఎం శ్రీలత తెలిపారు.

పీజీ కోర్సులపై ఫార్మ, ఇంజినీరింగ్ విద్యార్థుల ఆసక్తి

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఎంఏ, ఎంకాం కోర్సుల్లో ప్రవేశాలకు ఇంజినీరింగ్, బీఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన 1200 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సీపీజీఈటీ–2024 దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి వివరించారు.

వేర్వేరు ఘటనల్లో రైలుకింద పడి ఇద్దరి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నాయి. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..ఘట్‌కేసర్–చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య సమీపంలోని ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు సమాచారం మేరకు వెళ్లిన పోలీసులు వివరాలు సేకరించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సదరు వ్యక్తి పట్టాలపై తలపెట్టి ఆత్యహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై నీలిరంగు నిండుచొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో మహిళ

సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన గూడ్సు రైలు అమ్మగూడ రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుతుండగా ఓ మహిళ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. మహిళ ఒంటిపై బూడిదరంగు చీర, ఆకుపచ్చ చుక్కల జాకెట్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి ముఠా రిమాండ్

అమీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న ముఠాను రిమాండ్‌కు తరలించిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ జానకి రాములు వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అమీర్‌పేటలోని ఏబీసీ హోటల్ వద్ద ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. మంచిర్యాల జిల్లా మామిడిపల్లికి చెందిన మొహ్మద్ అబ్దుల్ కలాం అలియాస్ బన్నీ (21) బొమ్మెన జాన్సన్ (23)కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన మొలుగూరి నవీన్ (24)ను అదుపులోని తీసుకుని విచారించగా గంజాయి విక్రయించేందుకు వచ్చినట్లు అంగీకరించారు. వారిచ్చిన సమాచారంతో మలక్‌పేట సమీపంలోని సలీంనగర్‌లోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించారు. అక్కడి నుంచి మంచిర్యాల జిల్లా మేదరిపేటకు చెందిన సులువ సురేష్ (38) దండెపల్లి నివాసి మామిడిపల్లి రాజేష్ (37) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పుగోదావరి జిల్లా కొంతమూరుకు చెందిన కోసూరి సతీష్ (40)ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 21.4 కిలోల గంజాయి, ఓ కారు స్వాధీనం చేసుకున్నారు. వీరిందరికి ఒడిషా రాష్ట్రానికి చెందిన అశోక్, మహారాష్ట్రకు చెందిన మరి కొందరు గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

గాంధీలో 'జూడా'ల నిరసన



గాంధీఆస్పత్రి : న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గాంధీలో జూనియర్ డాక్టర్లు (జూడాలు) శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు హర్ష, వంశీ, లౌక్య మాట్లాడుతూ.. గ్రీన్ ఛానెల్ ద్వారా సకాలంలో స్టైఫండ్ విడుదల, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్‌కు సరైన గౌరవ వేతనం, తెలంగాణలో ఏపీ విద్యార్థులకు 15 శాతం సీట్ల రిజర్వేషన్ ఎత్తివేత, ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం, కాకతీయ మెడికల్ కాలేజీలో రహదారులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లో చేపట్టిన స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి సూచించారు. ప్రకాష్‌నగర్‌లో ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాల్ వెనుక రూ.7 లక్షల వ్యయంతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన పనులు ఇంకా పూర్తి కాక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నాణ్యత విషయంలో ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఆమె వెంట డీఈ సంతోష్, ఏఈ తిరుమలయ్య, నాయకులు శ్రీహరి ఉన్నారు.



ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సికింద్రాబాద్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ సూచించారు. శుక్రవారం మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద ఆటో డ్రైవర్లకు చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ సంపత్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా పలువురు ప్రయాణికుల ప్రాణాలు రక్షించిన వారవుతారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని, విధిగా డ్రైవర్లు ఖాకీ చొక్కా ధరించాలని కోరారు. అనంతరం చిలకలగూడ ఎక్స్ రోడ్డు వద్ద స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నెంబరు ప్లేట్ లేని నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసిన 9 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు.


ఆటోడ్రైవర్లకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్

ప్రొ. జయశంకర్‌కు ఘన నివాళి


చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం


నివాళులర్పించిన హేమలత, రాజేందర్

అడ్డగుట్ట: తుది శ్వాస వరకు తెలంగాణ సాధన కోసం పోరాడిన మహనీయుడు ప్రొ. జయశంకర్ అని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి కొనియాడారు. జయశంకర్ వర్ధంతి పురస్కరించుకొని అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి ప్రొ. జయశంకర్ అన్నారు. శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్యగౌడ్, దాసరి శ్రీనివాస్, కైరంకొండ యాదగిరి, వసంత, మహ్మద్, అమర్, గౌస్, దేవయ్య, ఇస్మాయిల్, వెంకటేష్, రాజు, మహేందర్, రజిని పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొ.జయశంకర్ ని వాళి అర్పించారు. శుక్రవారం ఓయూ ఉద్యోగ సంఘాల నేతల ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని నాన్ టీచింగ్ హోమ్‌లో ఏర్పాటు చేసి న కార్యక్రమంలో ప్రొ.జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొల్లారం చౌరస్తా, అల్వాల్ వద్ద..

రసూల్‌పురా: ప్రొ. జయశంకర్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర బేవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు. జయశంకర్ వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం బొల్లారం చౌరస్తా, అల్వాల్ ధర్నాచౌక్ వద్ద ఆయన విగ్రహానికి గజ్జెల నాగేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సత్యనారాయణ గౌడ్, రావుల సతీష్ మురళియాదవ్, నవీన్ గణేష్, శేఖర్, ప్రభు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలు జరిగాయి. స్థానిక కార్పొరేటర్ సామల హేమ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బన్సీలాల్‌పేట్: తెలంగాణ ఉద్యమకారులు రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం బోయిగూడలో నిర్వహించిన ప్రొ. జయశంకర్ వర్ధంతి కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హేమలత, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, కుమార్ యాదవ్, దేశపాక శ్రీనివాస్, సాయిక్రిష్ణ, నాగభూషణం, అరుణ్‌గౌడ్ పాల్గొని నివాళులర్పించారు.


నివాళి అర్పిస్తున్న గజ్జెల నాగేష్


నివాళి అర్పిస్తున్న ప్రసన్నలక్ష్మి

మా ఇళ్లు ఇప్పించండి సారూ..

హమాలీబస్తీ వాసుల ఆవేదన


హమాలీబస్తీలో శిథిలావస్థకు చేరిన గృహసముదాయాలు

సికింద్రాబాద్: కొత్త ఇళ్లు వస్తుందన్న ఆశతో పూరి గుడిసే ఖాళీ చేసి అక్కడి స్థలాన్ని బడుగు, బలహీనవర్గాల గృహసముదాయానికి ఇచ్చారు. అక్కడ గృహనిర్మాణాలు జరిగి కూడా ఇప్పటికి సరిగ్గా పదేళ్లు పూర్తయ్యాయి. అయినా నేటికీ లబ్ధిదారులకు గృహాలు అందలేదు. దీంతో సీతాఫల్‌మండి డివిజన్ హమాలీ బస్తీలో నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరుతుండడంతో పాటు ఇక్కడి 60 మంది లబ్ధిదారులకు ఏళ్ల తరబడి అద్దెల దరువులు తప్పడం లేదు. తాజాగా మధురానగర్‌లోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్లో లష్కర్ ప్రత్యేక జిల్లా ఉద్యమ నాయకులతో శుక్రవారం హమాలి బస్తీ లబ్ధిదారులు సమావేశమయ్యారు. ఉద్యమ సమితి అధ్యక్షుడు గుర్రంపవన్‌కుమార్‌తో పాటు సమితి సభ్యులను కలిసిన హమాలిబస్తీ లబ్ధిదారులు తమకు న్యాయం చేయించాలని మొర పెట్టుకున్నారు. 2014లో బలహీనవర్గాల గృహాల నిర్మాణం పూర్తయిన నాటి నుంచి లబ్ధిదారులు అధికారులు, పాలకులతో మొర పెట్టుకున్నా స్పందించలేదు. 2012లో అప్పటి ప్రభుత్వం పేదలకు గృహనిర్మాణాల సముదాయాలు నిర్మించి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇదే పథకం ద్వారా పక్కా గృహాలు పొందడం కోసం హమాలిబస్తీలో ఉంటున్న గుడిసే వాసులు 270 మంది తాము ఉంటున్న స్థలాలను ఖాళీ చేశారు. అదే సంవత్సరంలో గృహనిర్మాణాలు ప్రారంభించిన ప్రభుత్వం 2014లో పూర్తి చేసింది.

సాంకేతిక సమస్య పేరుతో కాలయాపన..

లబ్ధిదారులందరికీ పొజిషన్ సర్టిఫికెట్లు అందించి ఇళ్లు అప్పగించిన అధికారులు 60 మందికి మాత్రం గృహాలు అందించలేదు. ఇళ్ల పంపిణీలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని త్వరలోనే వాటిని పరిష్కరించి ఇళ్లు అందిస్తామని చెప్పిన అధికారులు తిరిగి ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇక్కడి నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు కూడా జిల్లా కలెక్టర్లకు లేఖలు రాసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదు. కొందరు అవే గృహసముదాయాల మెట్ల కింద పరదాలు కట్టుకుని అరకొర వసతుల మధ్య జీవిస్తుండగా, ఇంకొందరు అద్దెలు చెల్లిస్తూ బయట ఉంటున్నారు. లబ్ధిదారులతో సమావేశమైన అనంతరం లష్కర్ సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇతర ప్రభుత్వ పెద్దలు, అధికారుల దృష్టికి హమాలిబస్తీ గృహాల లబ్ధిదారుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారమార్గం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల సంఘం ప్రతినిధులు అంజయ్య, రవి, నర్సింగరావు, ప్రత్యేక జిల్లా సాధన సమితి ప్రతినిధులు సాదం బాల్‌రాజ్‌యాదవ్, మిట్టపల్లి బాబురావు, జగదీశ్‌గౌడ్, శైలేందర్ రవీందర్‌సాగర్, కృష్ణముదిరాజ్, అశోక్‌చారి తదితరులు పాల్గొన్నారు.


లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులకు వినతిపత్రం అందిస్తున్న లబ్ధిదారులు